నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శనివారం 18 జనవరి 2025 | KARIMNAGAR

## దాడి సిగ్గుచేటు

మానకొండూర్, జనవరి 17: సాగునీటి విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసినందుకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అనుచరులు, కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం సిగ్గుచేటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు విమర్శించారు. మానకొండూర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారని మండి పడ్డారు. ఇకనైనా నీచ రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. తాము రోడ్లపైకి వచ్చి దాడులు చేస్తే కాంగ్రెస్ నాయకులు బయట తిరుగరనే విషయం గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

# ఎంసీహెచ్‌పై నిర్లక్ష్యమెందుకు?

- మంథనిలో కనీసం గైనకాలజిస్ట్‌ను నియమించరా..?
- అంబులెన్స్‌లపై ఫొటోలు కాదు.. ప్రజా సమస్యలు పరిష్కరించాలి
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధ్వజం

మంథని, జనవరి 17: మంత్రి శ్రీధర్‌బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథనిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)పై నిర్లక్ష్యం ఎందుకని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తారనుకుంటే ఎంసీహెచ్‌లో కనీసం గైనకాలజిస్టును కూడా నియమించలేక పోతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి అంబులెన్సులపై తన ఫొటోలు పెట్టుకోవడం కాదని, ప్రజల సమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన అంటే.. ఎమర్జెన్సీ పాలనే కనిపిస్తున్నదని ధ్వజమెత్తారు. మంథనిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని (ఎంసీహెచ్) శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పుట్ట మధూకర్ మాట్లాడుతూ, అంబులెన్సులపై తన ఫొటో పెట్టించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ దవాఖానల్లో నెలకొన్న సమస్యలను మాత్రం గాలికి వదిలేశారని విమర్శించారు. తెలంగాణలో ఎక్కడ సభలు జరిగినా సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి శ్రీధర్‌బాబు.. శ్రీధర్‌బాబును రేవంత్‌రెడ్డి పొగుడుకోవడమే సరిపోతున్నదని ఎద్దేవా చేశారు. మంథని ఎమ్మెల్యేగా ఐదు సార్లు గెలిపించినా ప్రజలను ఓట్ల యంత్రాలుగానే చూడడమే తప్పా ఏనాడూ సేవ చేయాలనే ఆలోచన ఆయనకు లేదని విమర్శించారు. ఎంసీహెచ్‌లో రెండు నెలలుగా గైనకాలజిస్ట్ లేకపోవడంతో నియోజకవర్గంలోని గర్భిణులు ఇబ్బందులు పడుతూ పెద్దపల్లి, గోదావరిఖనిలోని దవాఖానలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. తరచూ మంథనికి వచ్చే కలెక్టర్ కూడా దవాఖానపై ఎందుకు దృష్టిపెట్టడం లేదని, వైద్యులను ఎందుకు నియమించడం లేదన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రూ. కోట్లు వెచ్చించి మాతా శిశు ఆరోగ్య కేంద్రాలను నిర్మించారన్నారు. తాను జడ్పీ చైర్మన్‌గా ఉన్న సమయంలో దవాఖానలోని గర్భిణులు, బాలింతల కోసం కూలర్లతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించానని గుర్తు చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎంసీహెచ్‌లో గైనకాలజిస్టును నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, మాచిడి రాజుగౌడ్, గొబ్బూరి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

# బాల్యం.. బలహీనం!

## పిల్లలకు ‘ఎనిమి’గా ఎనీమియా

- ఇటీవల జగిత్యాల జిల్లాలో 5, 6, 7వ తరగతి పిల్లలకు రక్త పరీక్షలు
- 71 శాతం మంది రక్తహీనత బాధితులే
- గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యార్థులే అధికం
- పౌష్టికాహారం అందకపోవడమే కారణం!
- పోషకాహారం అందిస్తున్నామన్నది ఉత్తమాటే!
- పిల్లలను వెంటాడనున్న శారీరక, మానసిక రుగ్మతలు
- ఆందోళనలో తల్లిదండ్రులు


జగిత్యాల మండలంలోని ఓ పాఠశాలలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే సిబ్బంది

*బాల్యం బలహీనమవుతున్నది. పిల్లలను రక్తహీనత (ఎనీమియా) వెంటాడుతున్నది. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 20 వేల మంది బాలబాలికల్లో రక్తం శాతాన్ని పరిశీలిస్తే.. కేవలం 29 శాతం మంది పిల్లలు మాత్రమే సరైన మోతాదులో రక్తం కలిగి ఉండగా, 71 శాతం మంది రక్తహీనతతో బాధపడుతుండడం కలవరపెడుతున్నది. అందులో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులే అధికంగా ఉన్నట్టు తెలుస్తుండడం ఆందోళనకు గురి చేస్తున్నది. ఎనీమియాతో బాధపడే పిల్లలు శారీరక, మానసిక రుగ్మతల బారిన పడడమే కాకుండా, చదువు, క్రీడలపై సరైన దృష్టి సారించలేని పరిస్థితి ఉంటుంది. అయితే పౌష్టికాహార లోపమే అందుకు కారణమని వైద్యులు చెబుతున్నారు. రక్తహీనత బాల్యంలో ప్రారంభమై క్రమంగా పెరుగుతుందని, పెద్దవాళ్లు అయిన తర్వాత సైతం అనేక శారరీక సమస్యలకు కారణమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.*

జగిత్యాల, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : శరీరంలో ఐరన్ లోపం ఉంటే రక్త హీనత వస్తుంది. దానినే వైద్య పరిభాషలో ఎనీమియాగా చెబుతారు. రక్తహీనత ఉంటే అనేక సమస్యలు వస్తాయి. ముఖ్యంగా శరీరానికి ప్రాణవాయువు (ఆక్సీజన్) సరఫరా సరిగ్గా కాక, పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల దెబ్బతింటుంది. దీంతో అనేక శారీరక, మానసిక రుగ్మతల బారిన పడుతారు. రక్తహీనతతో బాధపడే పిల్లల్లో శారీరక నీరసం, అలసట ఉంటుంది. దీనివల్ల చురుకుదనం తగ్గిపోతుంది. ఆటలు, ఇతర సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనలేకపోతారు. దృష్టిలోపం బారిన పడి చదువుల్లో వెనుకబడిపోతారు. ఈ వైకల్యాలు క్రమంగా పెరిగిపోయి, పిల్లలు యువతగా మారిన తదుపరి సైతం వారిని వెంటాడుతాయి.

### రెండు నెలలపాటు పరీక్షలు

పిల్లల్లో రక్తహీనత పెరిగిపోతున్నదని, ముఖ్యంగా వెనుకబడిన దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని ఐక్యరాజ్య సమితి, ఇతర స్వచ్ఛంద సంస్థలు ఆందోళనలు వ్యక్తం చేయడంతోపాటు రక్తహీనత నివారణకు నిధులు మంజూరు చేశాయి. ఈ నేపథ్యంలోనే మన దేశంలోనూ రక్త హీనతపై అధ్యయనం చేసి, ఎనీమియా బాధిత చిన్నారులకు స్వస్థత కలిగించే చర్యలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమాన్ని చేపట్టింది. ఒక్కో జిల్లాకు 12 బృందాలను నియమించింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో జగిత్యాల జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా 5, 6, 7వ తరగతి చదువుతున్న బాల బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. 100 గ్రాముల రక్తంలో 12 గ్రాముల కంటే ఎక్కువ రక్తం శాతం ఉంటే రక్తహీనత లేదని, 12 గ్రాముల కంటే తక్కువ 8 గ్రాముల కంటే ఎక్కువగా ఉంటే మధ్యస్థ ఎనీమియా బాధితులుగా గుర్తించారు. రక్తంలో 8 గ్రాముల కంటే తక్కువ ఉన్న వారిని తీవ్రమైన ఎనీమియా బాధితులుగా నిర్ధారించారు.

### 71 శాతం రక్తహీనత బాధితులే..

రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లాలో మొత్తం 19,846 మంది చిన్నారులకు పరీక్షలు చేశారు. అందులో 10,478 మంది బాలికలు కాగా, 9368 మంది బాలురు ఉన్నారు. అయితే 5,883 మంది బాలబాలికలు మాత్రమే నిర్దేశిత రక్తశాతం కలిగి ఉన్నారు. అందులో 2908 మంది బాలికలు, 2975 మంది బాలురు ఉన్నారు. బాలికల్లో 27.75 శాతం మందికి నిర్దేశిత రక్తశాతం కలిగి ఉండగా, 73.25 శాతం మందికి ఎనీమియా ఉన్నట్టు నిర్ధారించారు. ఇక బాలురలో 31.75 శాతం మంది సరైన రక్తశాతాన్ని కలిగి ఉండగా, 69.25 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. 4911 మంది బాలబాలికలకు 11 నుంచి 10 గ్రాముల మధ్య రక్తశాతం ఉండగా, అందులో 2538 మంది బాలికలు, 2373 మంది బాలురు ఉన్నారు. ఇక 9 నుంచి 8 గ్రాముల రక్తశాతం కలిగిన వారిలో 4558 మంది బాలికలు, 3758 మంది బాలురు మొత్తంగా 8317 మంది ఉన్నారు. ఇది అత్యంత బాధాకరమని వైద్యులు చెబుతున్నారు. 7 గ్రాముల కంటే తక్కువ రక్తశాతం కలిగిన వారిలో 474 మంది బాలికలు, 261 మంది బాలురు మొత్తం 735 మంది ఉన్నట్టు లెక్క తేల్చారు. మొత్తంగా పరిశీలిస్తే పెద్ద సంఖ్యలోనే మధ్యస్థ, తీవ్రస్థాయి ఎనీమియా బాధితులు ఉన్నారని స్పష్టమైంది. కేవలం 29 శాతం మంది బాల బాలికలు మాత్రమే కలిగి ఉండగా, 71 శాతం మంది పిల్లలు రక్తహీనత బాధితులే అని గణాంకాల ద్వారా తెలుస్తున్నది.

### గ్రామీణ పిల్లలే అధికం

ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థుల్లోనే రక్తహీనత అధికంగా ఉన్నట్లుగా తెలుస్తున్నది. గ్రామీణ పిల్లల్లో 90 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని, పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులే కొంత మెరుగ్గా ఉన్నారని ప్రత్యేక బృందాలు అభిప్రాయ పడుతున్నాయి. నిజానికి పిల్లల్లో రక్తహీనతతను నివారించేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉన్నది. సర్కారు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్నా పౌష్టికాహారం మాత్రం అందడం లేదని తెలుస్తున్నది. ప్రభుత్వం అతి తక్కువగా నిధులు ఇస్తుండడంతో మధ్యాహ్న భోజనంలో పోషకాహారం అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఆకు కూరలు, గుడ్లు, మాంసకృత్తులు, బెల్లం, నువ్వులు, పల్లీలు, తాజా కూరగాయలు పిల్లలకు అందిస్తేనే వారిలో రక్తం వృద్ధి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. అయితే, అందులో ఏ ఒక్కటీ మధ్యాహ్న భోజనంలో అందించడం లేదు. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్డు ధర ₹7 పలుకుతుండగా, పాఠశాలల్లో భోజనం అందించే గుడ్డుకు కేవలం ₹5 ఇస్తున్నారు. ₹2 నష్టంతో భోజన తయారీదారులు కోడిగుడ్లు కొని వడ్డించడం లేదు. ఇక ఆకు కూరలు, నూనె ధరలు పెరగడంతో వాటిని తగ్గించారు. బెల్లం, నువ్వులు, రాగిజావను గత ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థతో కలిసి సంయుక్తంగా అమలు చేసినా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వచ్ఛంద సంస్థకు ప్రభుత్వ వాటా ఇవ్వకపోవడంతో రాగిజావ, 10 గ్రాముల బెల్లం ప్యాకెట్ పంపిణీని ఆ సంస్థ నిలిపివేసింది. పోషకాహారం అందకుండా పోవడమే పిల్లల్లో రక్తహీనతకు కారణమని వైద్యులు చెబుతుండగా, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం



రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఎనీమియా బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉండడం బాధాకరం. రక్తహీనతను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పిల్లలకు ఉన్న రక్తహీనత స్థాయిని బట్టి వారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నాం. ప్రతి రెండు నెలలకు ఒక్కసారి పిల్లలకు రక్త పరీక్షలు చేస్తున్నాం. ఆ నివేదికల ఆధారంగా పిల్లలకు మందులు, తగిన ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

**- డాక్టర్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్**

### పోషకాహారమే సరైన మార్గం



రక్త హీనత (ఎనీమియా) అనేది చూడడానికి సాధారణంగా కనిపిస్తుంది. కానీ, ఇది అత్యంత ప్రమాదకరమైన అంశం. మనిషికి రక్తం ఉన్నప్పుడే ఏమైనా సాధించగలడు అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. అయితే, దురదృష్టవశాత్తు పిల్లలు అధిక శాతం ఎనీమియాతో బాధపడుతుండడం చూస్తున్నాం. 30 ఏండ్ల క్రితం 20 ఏండ్ల లోపు పిల్లల కంటికి అద్దాలు కనిపించేవి కాదు. వందలో ఒకరో ఇద్దరి ఉంటే ఎక్కువ. అలాంటి వారిని తరగతి గదిలో ఇతర పిల్లలు ఆటపట్టించేవారు. అలాగే, అద్దాలు పెట్టుకునే పిల్లలు ఎక్కువ పుస్తకాల పురుగులని, బాగా చదువుతారని అందుకే కంటి అద్దాలు వచ్చాయని అనుకునేది. అయితే, ఇప్పుడు పరిస్థితి మారింది. తరగతి గదిలో సగానికి పైగా మంది పిల్లలు కళ్లద్దాలు పెట్టుకునే కనిపిస్తున్నారు. అద్దాలు పెట్టుకునే పిల్లలు క్లెవర్ పిల్లలు అని అనుకునే పరిస్థితులు పోయాయి. పిల్లలే కాదు.. యువతుల్లోనూ రక్తహీనత కనిపిస్తుంది. ఎనీమియా పోవాలంటే మాత్రలు పంపిణీ చేయడం కాదు.. పోషకాహారం అందించేలా చూడాలి. ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని పంపిణీ చేయాలి. ఆకుకూరలు, డ్రైఫ్రూట్స్, చికెన్, తాజా కూరగాయలు, సీ విటమిన్ అధికంగా ఉండే ఆహారం, పల్లిపట్టీలు, నువ్వుల ముద్దలాంటివి సరఫరా చేయాలి. చిన్నప్పటి నుంచే సమతుల ఆహారం ఇవ్వాలి.

**- డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి, పిల్లల వైద్య నిపుణుడు**


మాట్లాడుతున్న బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

# ఆర్ఎంపీలు, పీఎంపీలకు ఇచ్చిన హామీ ఏమైంది?

- భయభ్రాంతులకు గురిచేయడం సరికాదు
- ‘స్థానిక’ ఎన్నికల్లో గెలుపొందాలనే కుట్రతోనే దాడులు
- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ, జనవరి 17: ఎన్నికల ముందు ఆర్ఎంపీలు, పీఎంపీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించే వారిని బెదిరింపులకు గురిచేస్తూ స్థానిక సంస్థల్లో గెలుపొందాలని ఆ పార్టీ కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. ఆర్ఎంపీ, పీఎంపీలపై దాడులను ఖండిస్తున్నామని, వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వేములవాడ పట్టణంలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2009లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 60 వేల మంది ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 13 నెలలైనా ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. కనీస సమాచారం లేకుండానే క్లినిక్‌లలో తనిఖీలు, సీజ్ పేరిట భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశారని ఆరోపించారు. నాంపల్లిలో ఆర్ఎంపీ శ్రీనివాస్ క్లినిక్‌ను కూడా సీజ్ చేసి కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యేకు తెలిసి దాడి జరిగిందా..? సమాచారం లేక జరిగిందో స్పష్టం చేయాలన్నారు. అధికారులు రాత్రి సీజ్ చేసి ఉదయాన్నే సీల్ తొలగించడం ఏ చట్టంలో ఉందని ప్రశ్నించారు. లేక నాయకులకు తలొగ్గి పని చేస్తున్నారో..? ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. అన్నింటినీ తెరిచిన అధికారులు నాంపల్లిలోని శ్రీనివాస్ క్లినిక్‌ను ఎందుకు తెరవలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్యాధికారి బాధ్యతగా నడుచుకోవాలని, బలవంతంగా దాడులకు పూనుకుంటే తగిన సమాధానం చెబుతామన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య, సింగిల్ విండో చైర్మన్ రామ్మోహన్ రావు, కౌన్సిలర్లు గోలి మహేశ్, సిరిగిరి రామచందర్, నరాల శేఖర్, నాయకులు డప్పుల అశోక్, కొండ కనకయ్య, మంతెన సంతోశ్, వెంగల శ్రీకాంత్ గౌడ్, రాజు, కమలాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సందీప్, ప్రేమా చారి, గుండెకర్ల నరేశ్, చీటి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్ల సెస్ కార్యాలయం

# సర్కారు నిర్లక్ష్యం.. ‘సెస్’కు భారం!

*సహకార రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ (సెస్) సర్కారు విధానాలతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నది. విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం శాపంలా మారుతున్నది. మరోవైపు సెస్ నష్టాల్లో ఉందంటూ ఈఆర్‌సీ పేర్కొంటున్నది. ఈ నేపథ్యంలో చర్యలకు సిద్ధమైన సెస్.. రూ.కోట్లలో బకాయిలు పడ్డ సర్కారు ఆఫీసులకు షాక్ నిచ్చింది. బకాయిలు చెల్లించాలంటూ నోటీసులు ఇచ్చినా స్పందించని పలు కార్యాలయాలకు విద్యుత్ సరఫరా నిలిపేసింది.*

- విద్యుత్ బిల్లుల చెల్లింపులో అలసత్వం
- రూ. వంద కోట్లలో బకాయిలు
- నోటీసులు ఇచ్చినా స్పందన కరువు
- చర్యలకు సిద్ధమైన సంస్థ
- ప్రభుత్వ ఆఫీస్‌లకు కరెంట్ కట్


రాజన్న సిరిసిల్ల, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలోనే అభివృద్ధి చెందుతున్న ఏకైక సహకార విద్యుత్ సంస్థ రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే ఉంది. వ్యవసాయ రంగానికి, పరిశ్రమలకు, నివాసాలకు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి వెలుగులు నింపుతున్న సెస్‌ను చీకట్లు కమ్ముకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు భారమైపోతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు ₹వందల కోట్లలో బకాయిలు చెల్లించడం లేదని, దీంతో సెస్ సంస్థ అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఏర్పడిందంటూ విమర్శలు వ్యక్త మవుతున్నాయి.

### ₹161.91కోట్ల బకాయిలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలోని పరిశ్రమలు, వ్యవసాయ రంగం, గ్రామ పంచాయతీలు, సర్కారు కార్యాలయాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నది. సంస్థకు జిల్లా వ్యాప్తంగా 2.99 లక్షల మంది వినియోగదారులున్నారు. వినియోగదారుల వాటాధనంతో నడుస్తున్న ‘సెస్’.. ఏపీ ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు విక్రయిస్తున్నది. జిల్లాలో అత్యధికంగా వ్యవసాయ కనెక్షన్లు దాదాపు 80 వేల వరకు ఉంటాయి. అందులో రెండోది మరమగ్గాల పరిశ్రమ. తర్వాత రైస్‌మిల్లులు, వివిధ పరిశ్రమలకు విద్యుత్ సరఫరా చేస్తున్నది. అందులో వినియోగదారులు, వివిధ పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాయాలు మొత్తం కలిపి ఇప్పటి వరకు సెస్ సంస్థకు ₹161.91కోట్ల బకాయిలు పేరుకు పోయాయి. మరమగ్గాలకు రావాల్సిన సబ్సిడీ ₹36.92 కోట్లు, వ్యవసాయరంగం ₹16.40 కోట్లు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు ₹36.22 కోట్లు, బడులు, దేవాలయాలు ₹57 కోట్ల బకాయిలున్నాయి. ప్రభుత్వం నుంచి దాదాపు ₹140 కోట్లు రావాల్సి ఉంది. జీపీలు, మున్సిపాలిటీల బకాయిలు పేరుకు పోయాయి. జిల్లాకు తలమానికం, వ్యాపార రంగంలో అగ్రగామిగా ఖ్యాతి గడించిన వస్త్ర పరిశ్రమలో 40 వేల మరమగ్గాలున్నాయి. వీటిని అనుబంధ పరిశ్రమలు వార్పిన్, డైయింగ్‌లు, సైజింగ్ పరిశ్రమలున్నాయి. వీటికి ప్రభుత్వం 50 శాతం విద్యుత్ సబ్సిడీ ఇస్తున్నది. వాటి నిధులు కూడా విడుదల చేయడం లేదు. కాగా, అక్టోబర్‌లో సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో విద్యుత్ నియంత్రణ మండలి నిర్వహించిన విద్యుత్ బిల్లుల పెంపు విషయమై బహిరంగ విచారణ నిర్వహించింది. మరమగ్గాలకు ఇస్తున్న 10 హెచ్‌పీల విద్యుత్ సబ్సిడీని 25కి పెంచాలని మాజీ మంత్రి కేటీఆర్ చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం స్పందించింది. 10 నుంచి 25 హెచ్‌పీలకు సబ్సిడీ పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. జీవో జారీ చేసి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సబ్సిడీ పైసలు సెస్‌కు విడుదల చేయలేదు. దీంతో పెండింగ్ బకాయిలతోపాటు కొత్త బకాయిలు భారమయ్యాయి. నిధులు విడుదల చేసి మరమగ్గాల పరిశ్రమకు చేయూత నివ్వాలని వస్త్ర వ్యాపారులు కోరుతున్నారు.

### కార్యాలయాలకు కరెంట్ కట్

నెలల తరబడి కరెంట్ బిల్లులు చెల్లించని కార్యాలయాలపై సెస్ చర్యలు తీసుకుంటున్నది. శుక్రవారం పలు కార్యాలయాలకు కరెంటు సరఫరా నిలిపి వేసింది. బిల్లులు చెల్లించాలంటూ జీపీలు, మున్సిపాలిటీలు, తహసీల్, పొదుపు సంఘాల కార్యాలయాలకు నోటీసులు ఇచ్చింది. నోటీసులకు స్పందించక పోవడంతో కరెంటు కట్ చేసింది. సిరిసిల్ల మున్సిపాలిటీ ₹4 కోట్ల 58లక్షల 91వేలు, తహసీల్ ఆఫీస్ ₹1.76 కోట్లు, ఫారెస్టు ఆఫీస్ ₹5.47 కోట్లు, పొదుపు భవన్ ₹7.42కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖ భవనం ₹5కోట్ల 49 లక్షలు, ఆర్డీవో కార్యాలయం ₹4.44కోట్లు, జడ్పీ కార్యాలయం ₹1.71కోట్లు బకాయిలున్నట్టు సెస్ అధికారులు తెలిపారు. మున్సిపల్, ఎమ్మార్వో, పొదుపు భవన్, ఫారెస్టు కార్యాలయాలకు కరెంటు సరఫరా నిలిపి వేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కరెంటు లేక పోవడంతో తహసీల్, మున్సిపల్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు నిలిచి పోయాయి. ప్రభుత్వం ఇప్పటి కైనా విద్యుత్ బిల్లులు విడుదల చేసి సెస్ సంస్థ అభివృద్ధికి సహకారం అందించాలని కోరుతున్నారు.



సిరిసిల్ల టౌన్, జనవరి 17 : సిరిసిల్ల మున్సిపల్‌కు సెస్ అధికారులు శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ₹4 కోట్ల విద్యుత్ బిల్లులు బకాయి ఉండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు సెస్ ఎండీ విజయేందర్‌రెడ్డి తెలిపారు. దీంతో వెంటనే మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ లావణ్య సెస్ సంస్థ అధికారులతో మాట్లాడి విద్యుత్ బిల్లుల చెల్లిస్తామని తెలుపడంతో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు చెప్పారు.


సుంకె రవిశంకర్‌తో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు

# ప్రజా ప్రభుత్వమా.. ఫ్యాక్షన్ ప్రభుత్వమా?

- దాడులకు భయపడేది లేదు
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, జనవరి 17 : రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం నడుస్తున్నదా..? ఫ్యాక్షన్ ప్రభుత్వం నడుస్తున్నదా..? అని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ధ్వజమెత్తారు. కాంగ్రెస్ దాడులకు భయపడేది లేదని, బీఆర్ఎస్ నేతల ఆత్మస్థైర్యాన్ని ఇలాంటి చిల్లర చేష్టలతో ఎప్పటికీ దెబ్బతీయలేరని స్పష్టం చేశారు. గంగాధర మండలం బూరుగుపల్లిలోని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయగా, శుక్రవారం ఆమె మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఇతర నాయకులతో కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా దావ వసంత దాడిని ఖండించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రం ప్రశాంతంగా ఉందని, పదేళ్లలో ఎక్కడా ఎలాంటి ఘటనలు జరగలేదని చెప్పారు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం సరికాదని హితవు పలికారు. మాజీ ఎమ్మెల్యే ఇంటిపైనే దాడి జరిగితే రాష్ట్రంలో ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు? వారి వెంట జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వొద్దినేని హరి చరణ్‌రావు, మాజీ జడ్పీటీసీలు రామ్మోహన్‌రావు, నాగం భూమయ్య, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.